ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 16 ఆగస్టు 2024

















జిల్లాను అన్నిరంగాల్లో ముందు నిలుపుతాం

- పెండింగు ప్రాజెక్టులన్నీ పూర్తి
- సూపర్‌సిక్స్ పథకాలు అమలు
- వ్యవసాయానికి పెద్దపీట
- రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాను విద్య, వైద్యం, వ్యవసాయం పరిశ్రమలు, పర్యాటకంతో పాటు అన్నిరంగాల్లో నెంబర్‌వన్‌గా నిలుపుతామని రాష్ట్ర న్యాయ, మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలను కడప పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిగా హాజరయ్యారు. కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ అతిథిసింగ్, ఎమ్మెల్యే ఆర్.మాధవీలు పాల్గొన్నారు. ఉదయం 9గంటలకు మంత్రి ఫరూక్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. అనంతరం వివిధ ప్లాటూన్లు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను వంద శాతం అమలు చేసి సమర్ధవంతమైన పాలనను చంద్రబాబు నాయకత్వంలో అందిస్తామన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ ఐదు కీలక హామీలపై సంతకం చేశారన్నారు. యువతకు పెద్దపీట వేస్తూ మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయగా, జనాలను భయపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేశారన్నారు. ఇక వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు అండగా ఉండేందుకు రూ.3వేలు పింఛన్‌ను రూ.4వేలకు పెంచారన్నారు. ఇచ్చిన హామీలను ఏప్రిల్ నుంచి అమలు చేసి మొత్తం రూ.7వేలును అందజేశారని తెలిపారు.

వ్యవసాయానికి పెద్దపీట

కడప జిల్లాను సమర్ధవంతంగా అభివృద్ధి చేయడంలో భాగంగా వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. రాబోయే 40 రోజుల్లో 40 టీఎంసీల నీటితో గండికోట రిజర్వాయరు, మైలవరం, చిత్రావతి పైడిపాలెం ప్రాజెక్టులకు నింపి 2.35 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుతో పాటు తెలుగు గంగ అనుబంధ రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపుతామన్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ వర్షపాతం 220.6 మి.మీ కాగా ఇంత వరకు 225.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 75.189 హెక్టార్లు కాగా 21.071 ఎకరాల్లో పంటలు సాగుకు నోచుకున్నాయి. వ్యవసాయంలో అధిక దిగుబడుల కోసం పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 72,176 మంది రైతులతో 1,04,267 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని సాగు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే రూ.6612 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం మిల్లర్ల ప్రమేయం లేకుండానే రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుంది. రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం ద్వారా 6.68 కోట్లతో ఉద్యాన రైతులకు చేయూత అందిస్తామన్నారు. 323.98 కోట్లతో 31,500 హెక్టార్లలో బిందు, తుంపర పరికరాలను పంపిణీని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతుల సమాజాభివృద్ధికి పశుసంవర్ధకశాఖ ద్వారా వివిధ పథకాలు అలమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి పథకం నుంచి 90 శాతం, లబ్ధిదారుని వాటి 10 శాతంతో కలిపి పశువుల కొనుగోలు, మినీ గోకులాలు ఇవ్వడం జరుగుతుంది. 75 శాతం ఉపాధి నిధులు, 30 శాతం లబ్ధిదారుని వాటాతో గొర్రె లు, మేకల కొనుగోలు, ఒక్కో మండలానికి రూ.25లక్షలతో 875మినీ గోకులాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

వృద్ధులకు బాసటగా పింఛన్ల పెంపు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు కార్యక్రమం జరిగింది. వృద్ధాప్య వితంతు, కల్లుగీత, చేనేత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, హెచ్ఐవీ, ట్రాన్స్‌జెండర్లు, సాంస్కృతిక కళాకారులకు రూ.3వేలు నుంచి 4వేలకు పెంచడం జరిగింది. అలాగే దివ్యాంగులు, కుష్టువ్యాధిగ్రస్తులకు రూ.6వేలకు, క్రానిక్ డిసీజ్ ఉన్నవారికి రూ.5వేల నుంచి 10వేలు ఇవ్వడం జరిగింది. ఆగస్టు నెలకు 2,64,040 మందికి రూ.112.49 కోట్లను అందించడం జరిగింది. తలసేమియా సిక్లింగ్‌సెల్ హిమోఫిలియా కిడ్నీ, బోదకాలు వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు చొప్పున, పెరాలసిస్ వ్యాధిగ్రస్తులకు రూ.15వేలు అందించడం జరుగుతుంది. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా జూలై చివరి నాటికి 40,365 శస్త్రచికిత్సలకు గాను రూ.77.55 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 41,986 స్వయం సహాయకసంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామీణ ప్రాతాల్లో వెనుకబడి ఎస్సీ ఎస్టీ మహిళలకు ఉన్నతి ద్వారా సున్నా వడ్డీతో 8.70 కోట్ల రుణాలు ఇవ్వనున్నారు. జిల్లాలో 2329 అంగన్వాడీ కేంద్రాల్లో 74,666 మంది గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు అమృతతుల్యమైన మెరుగైన పోషకాలు కలిగిన బాలసంజీవని కిట్స్ నెలనెలా ఇవ్వడం జరుగుతుంది. ఇక సఖి సెంటరు ద్వారా మానసిక శారీరక, లైంగిక, ఆర్థిక దుర్వినియోగానికి గురైన వారికి అండగా ఉంటూ న్యాయ సహాయాలు అందించడం జరుగుతుంది.

ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు.. విద్యకు పెద్దపీట

జిల్లాలో ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకుని... వచ్చే వంద రోజుల్లో 10,280 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉపాధి హామీ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 45 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా.. ఇప్పటికే 60 లక్షల పనిదినాలు కల్పించి 133.33 శాతం పురోగతి సాధించడం జరిగింది. 2.16 లక్షల మంది కూలీలకు రూ 155.60 కోట్లను వేతనాలు ఇవ్వడం జరిగింది. ఇక జిల్లాలో 220 పాఠశాలల్లో 1,29,799 మంది విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయడం జరుగుతుంది. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యార్థిమిత్ర ద్వారా 1 నుంచి 10 తరగతులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.39 కోట్లు ఖర్చు చేసి 1,42,708 విద్యార్థులకు యూనిఫాం, ఒక జత షూస్, రెండు జతల సాక్సులు, బెల్టు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, మరియు కొత్తగా ఇంటర్మీడియట్ చదువుతున్న 6530 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగులు ఇవ్వడం జరిగింది. మనబడి మన భవిష్యత్తులో భాగంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్వాడీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. డిజిటల్ విద్యాబోధన కోసం 402 పాఠశాలలకు 2150 ఇంటరాక్టివ్ ఫ్లాట్‌పానల్, 358 పాఠశాలల్లో 530 స్మార్ట్‌టీవీలను ఏర్పాటు చేసి డిజిటల్ బోధన అందిస్తున్నాం. 53 ప్రీ మెట్రిక్ వసతిగృహాలు, 15 పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో 5629 మంది ఎస్సీ విద్యార్థులకు విద్యతో పాటు వసతి ఏర్పాటు చేశాం.

పరిశ్రమల స్థాపనతో ఉపాధి...

జిల్లాలో 10వేల కోట్ల రూపాయల పెట్టుబడితో 28 భారీ పరిశ్రమలు స్థాపించి 16208 మంది ఉపాధి కల్పిస్తున్నాం. 36,113 సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలను రూ.32.46 కోట్లతో ఏర్పాటు చేసి 1,72,134 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. కొప్పర్తిలోని మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.276 కోట్లతో నీటి సరఫరా, ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం, కార్యనిర్వాహక కేంద్రం సర్వీసింగ్ స్టేషన్లతో కూడిన కార్గో, టెర్మినల్ నిర్మాణ పనులు చేపడుతున్నాం. బెంగుళూరు-కడప-విజయవాడ రహదారిని రూ.14,060 కోట్లతో ఆరు వరుసల ఎకనామిక్ కారిడార్‌గా నిర్మాణం చేయడం జరిగింది. వంద రోజుల ప్రణాళికలలో భాగంగా దెబ్బతిన్న రోడ్లను 27.66 కోట్లతో 6485 కిలోమీటర్ల రోడ్లను మరమ్మత్తులు చేయడం జరిగింది.



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

జిల్లాలో లక్షా 89వేల 959 వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. 628 వ్యవసాయ ఫీడర్స్ ద్వారా పగటి పూట 9 గంటలు ఉచితంగా నాణ్యమైన కరెంటు సరఫరా చేస్తున్నాం. ఇక ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు నెలకు 200 యూనిట్లను జగజ్జీవన్ జ్యోతి పథకం ద్వారా జిల్లాలో 81,501 ఎస్సీ గృహాలకు , 11,469 ఎస్టీ కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. ఇక ప్రజారవాణా వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతలో భాగంగా జిల్లాలో నూతన ఇసుక విధానం అమలు అవుతుంది. 11 డిపోల ద్వారా వినియోగదారులకు ఉచితంగా ఇసుక అందించడం జరుగుతుంది. ఇక పర్యాటకరంగం ప్రోత్సాహంలో భాగంగా జిల్లాలో సుప్రసిద్ధ చారిత్రాత్మక ప్రాముఖ్యత ఉన్న గండికోటను స్వదేశ్‌దర్శన్ 2.0 స్కీం కింద అభివృద్ధి చేయడం జరుగుతుంది. మొదటి దశలో బోటింగ్ సౌకర్యం, వాకింగ్‌ట్రాక్స్, వ్యూపాయింట్స్, టెన్‌సిటీ, టాయిలెట్స్ తదితర పనులు చేపడతాం. విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు 50 ఎకరాల్లో ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇక పేదలకు రూ.5కే రుచికర భోజనం అందించేందుకు సెప్టెంబరు చివరి నాటికి కడపలో 3 అన్నక్యాంటీన్లు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, మైదుకూరులో 8 అన్నక్యాంటీన్లను ప్రారంభిస్తాం అని మంత్రి ఫరూక్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప క్రైం, ఆగస్టు 15: కడప నగరం పోలీసు పెరేడ్ మైదానంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫారుఖ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జెండా వందనం చేశారు. మంత్రితో కలిసి కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి పోలీస్ పెరేడ్‌ను తిలకించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

కడపలోని వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యాలు చేశారు. జాతీయ జెండాలను పట్టుకుని చేసిన నృత్యాలు అందరినీ ఆకర్షించాయి. అలాగే కర్రస్వాము విన్యాసాలు చేశారు. కడప అగ్నిమాపక శాఖ ఆద్వర్యంలో నిర్వహించిన ఫైర్ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఎలా ఎదుర్కోవాలో డెమో చేసి చూపించారు. నీటితో త్రివర్ణ పతాకం పదర్శించడం అందరినీ అకట్టుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలను ప్రదర్శించారు. వివిధ ప్రభుత్వశాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్రం కోసం పోరాడిన యోధుల కుటుంబ సభ్యులను మంత్రి ఫరూఖ్ ఆద్వర్యంలో ఘనంగా సన్మా నించారు. అనంతరం వివి ధ ప్రభుత్వ శాఖలలో ఉత్త మ సేవలను అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, మెమెంటోలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు.



జెండా వందనం చేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు





జాతినేతలకు దక్కని గౌరవం



స్వాతంత్ర్య దినోత్సవం రోజు పూలదండకు నోచుకోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం

పులివెందుల రూరల్, ఆగస్టు 15: పులివెందులలో జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌లకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున కనీస గౌరవం దక్కలేదు. పులివెందుల పట్టణంలో ముద్దనూరు రోడ్డులో ఉన్నమహాత్మా గాంధీ, బోలేవార్డు సమీపంలో ఉన్న బీఆర్ అంబేద్కర్ విగ్రహాలు కనీసం పూలదండకు కూడా నోచుకోలేదు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద జాతీయజెండా ఎగురవేసి గౌరవవందనం చేశారు. జాతీయగీతాన్ని ఆలపించారు. అయితే జాతినేతల విగ్రహాలకు కనీస గౌరవం ఇవ్వకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్‌ల జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు మాత్రమే రాజకీయ నేతలకు గుర్తుకు వస్తారేమోనని ప్రశ్నిస్తున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించేందుకు, జాతి నిర్మాణంలో ప్రముఖంగా ఉన్న వారికి గౌరవం దక్కకపోవడం శోచనీయమని పలువురు అంటున్నారు.



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో బోసిపోయిన ఉన్న జాతి నిర్మాత బీఆర్ అంబేద్కర్

కలెక్టర్ దంపతులతో ఎమ్మెల్యే మాధవిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి



ఆహ్లాదకరంగా అట్ హోమ్

- కలెక్టరేట్ బంగ్లాలో తేనీటి విందు
- హాజరైన ఎమ్మెల్యేలు, అధికారులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 15: 78వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ బంగ్లాలో గురువారం రాత్రి కలెక్టర్ లోతేటి శివశంకర్ ఏర్పాటు చేసిన అట్ హోమ్ కార్య క్రమం అహ్లాదకర వాతావరణంలో జరిగింది. కార్యక్రమానికి కడప, జమ్మలమడుగు, మైదుకూరు ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధి కారి గంగాధర్‌గౌడ్, కడప నగరపాలక కమిషనరు వైవీ నందన్, నాలుగు డివిజన్ల ఆర్డీవోలతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా టూరిజంశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రత కొరకు... అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దామన్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలని కోరారు. అనంతరం కలెక్టర్ ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అధికారులను, వారి కుటుంబ సభ్యు లను పలకరించి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను కలెక్టర్ మెమెంటోలతో సత్కరించారు.



నృత్యకారిణులకు మెమెంటోల కార్యక్రమంలో కలెక్టర్,జేసీలతో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్

కరెన్సీ కొడితేనే.. కరెంటు మీటరు



- లో ఫీజుపై ఫీజు చెల్లించాల్సిందే..
- లేదంటే.. ఆఫీసు చుట్టూ తిరగాల్సిందే..
- విద్యుత్ అధికారుల మామూళ్ల దాహం
- దరఖాస్తుదారుల ఆవేదన

బద్వేలు, ఆగస్టు 15: కరెంటు మీటరు కావాలంటే కరెన్సీ కొట్టాల్సిందే. ప్రభుత్వ ఫీజుతో పాటు ప్రైవేటు ఫీజు అక్కడ చెల్లించాల్సిందే. అలా చెల్లిస్తేనే ఇంటికి కరెంటు మీటరు వస్తుంది. లేదంటే ఆ పత్రాలు సరిగా లేవు... ఈ పత్రాలు సరిగా లేవంటూ కొర్రీలు తప్పవు. కరెంటు ఆఫీసు చుట్టూ దరఖాస్తుదారుడు తిరగక తప్పదు. నియోజకవర్గ కేంద్రమైన బద్వేలు పట్టణంలో ఇంటికి కొత్తమీటర్ కావాలంటే ఈ తిప్పలు తప్పవని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.వేలల్లో అక్రమ వసూళ్లు

కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి, నిర్మించుకున్న వారికి విద్యుత్ మీటర్లు తప్పనిసరిగా అవసరమవుతాయి. ఇందు కోసం ప్రభుత్వ నిబంధన మేరకు రూ.4200 మీ సేవలో చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత దరఖాస్తు చేసుకోవచ్చు. అంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాత లో ఫీజు వ్యవహారం మొదలవుతుంది. దరఖాస్తు చేసుకునే ఇంటిని బట్టి రూ.4 వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తారనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. ఇంటి నిర్మాణానికి సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్, అప్రూవల్ అన్నీ ఉన్నా కూడా ఏదో రకంగా అభ్యంతరాలు చెప్పడం, అందుకు తగ్గట్లుగా ఎంతో కొంత వసూలు చేయడం జరుగుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. అయితే అదే ఇళ్లు అనుమతులు లేకుండా నిర్మించడం, లేక మరే చిన్న చిన్న పొరపాట్లు, సరైన పత్రాలు లేకపోవడం లాంటివి ఉండి.. ఇంటిమీటరు కోసం వెళితే రూ.4 వేల నుంచి 30 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

బద్వేలులో అక్రమార్కులు, కబ్జాదారులు ఎక్కువయ్యారన్న అపవాదు ఉంది. ఇలాంటివారు నిర్మించే కొన్ని ఇళ్లు కాని, స్థలాలు కొనుగోలు చేసిన వారి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో నిబంధనల ప్రకారం కరెంటు మీటర్లు ఇవ్వడం అంత సులభమైనసమైన పనికాదు. అలాంటి వాటికి కూడా మాముళ్లు తీసుకుంటూ విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో అయితే విద్యుత్ మీటరు కావాలంటే ఎన్ఓసీ తీసుకోవాల్సి ఉండేది. అయితే ఇప్పుడు అది లేకుండా లాయర్ నోటరీ పెట్టారు. ఎన్ఓసీ అయినా నోటరీ అయినా మా నోటు మాదే... అంటూ కొంతమంది విద్యుత్ అధికారులు మామూళ్లు వసూలు చేస్తున్నారని సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చట్టపరమైన చర్యలు చేపడతాం

కొత్తమీటరు మంజూరుకు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై విద్యుత్ శాఖ ఏడీ కుళాయప్పను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. గతంలో ఎన్ఓసీ ఉన్నపుడు అక్రమాలు జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పుడు ఎన్ఓసీ లేకుండానే అర్హులకు కొత్తమీటరు మంజూరు చేస్తున్నాము. ఎవరైనా మాముళ్లు అడిగినట్లు తన దృష్టికి తెస్తే చట్టపమైన చర్యలు చేపడతామని తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కడప పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న అధికారులు, ఉద్యోగులు



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న ఫారెస్టు జిల్లా అధికారి సందీప్‌రెడ్డి | నాగేశ్వర్ రావు జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ | చాముండేశ్వరి సివిల్ సప్లయ్ ఆఫీసర్ | నాగరాజా రావు హ్యాండ్‌లూమ్స్ | బాలాంజనేయులు ఆరోగ్య శ్రీ | డాక్టర్ నాగరాజు జిల్లా మెడికల్స్ | ప్రభాకర్ రెడ్డి డీపీఓ | సుదాకర్- అదనపు ఎస్పీ | సుదాకర్ - డీఎస్పీ డీఎస్పీ | గంగాధర్ గౌడ్ - డీఆర్ఓ | కౌసర్ బాను స్పెషల్ కలెక్టర్ | శ్రీనివాస్, ఆర్‌డీఓ జమ్మలమడుగు | వెంకటేశ్వర్, ఆర్‌డీఓ పులివెందుల | చంద్రమోహన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | వెంకటపతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ | సరస్వతి, డీడీ సోషల్ వెల్ఫేర్ | ప్రమోద్ సీడీపీఓ జమ్మలమడుగు | ఇమ్రాన్ షైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్



ఎస్పీ నుంచి పోలీస్ మెడల్ అందుకుంటున్న ఏఎస్ఐ అరుణాచలం, కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, శ్రీనివాసులు, జేసీ అదితి నుంచి విజయలక్ష్మి | మాధవిలత అడల్ట్ ఎడ్యుకేషన్ | నాగరాజ, ఏడీ అగ్రికల్చర్ | మాధవ్‌ఓబుల్‌రెడ్డి వెటర్నరీ సర్జన్ | రమేష్, ఈఈ డీపీఈ | శ్రీనివాసరావు ఆర్టీసీ డీఎం బద్వేలు | శివ ప్రసాద్ అసిస్టెంట్ కమిషనర్ | ముషాన్ వలి తహసీల్దార్, సిద్దవటం | డీజీపీ మెడల్స్ అందుకుంటున్న రాంగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు | క్రిష్ణయ్య లింగాల ఎస్ఐ | రంగస్వామి, ఎస్ఐ వన్‌టౌన్ కడప | రామకృష్ణ, ఎస్ఐ ప్రొద్దుటూరు | మొయినుద్దీన్, ఎస్ఐ ముద్దనూరు | కొండారెడ్డి, ఎస్ఐ, చాపాడు | అప్పలనాయుడు ఆర్ఎస్ఐ

సమరయోధుల త్యాగాలను మరువరాదు

స్వాతంత్ర్య దినోత్సవాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి - జిల్లా కలెక్టరు శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్

కడప (రూరల్), ఆగస్టు 15: స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ మరవరాదని వారి ఆశయ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేసి స్వాంతత్ర్య ఫలాలను అర్హులకు అందేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టులో 78వ సాతంత్ర్య దినోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి జాతీయ జెండాను ఎగురవేసిన ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి మాతృభూమి కోసం స్వాతంత్ర్య సమరమోధులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. స్వతంత్ర భారతావనిలో న్యాయవ్యవస్థ ప్రజలకు విశిష్టమైన న్యాయసేవలను అందిస్తోందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన న్యాయవ్యవస్థ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసేలా న్యాయాధికారులు, న్యాయవాదులు వడివడిగా ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కడప జిల్లా కలెక్టరేట్‌లో....

కడప(కలెక్టరేట్)ఆగస్టు15: స్వాతంత్ర్య దినోత్సవాలను కడప కలెక్టరేట్‌లో కలెక్టర్ లోతేటి శివశంకర్ ఘనంగా ప్రారంభించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్పీ





స్వాతంత్ర్య దినోత్సవాల్లో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న ప్రధాన జడ్జి శ్రీదేవి తదితరులు - కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ శివశంకర్

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో...

కడప(క్రైం), ఆగస్టు 15: ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అక్కడి సిబ్బందికి స్వీట్స్‌ను ఎస్పీ అందజేశారు. అలాగే కడప కేంద్ర కారాగారంలో సూపరిడెంటెంట్ ప్రకాష్ జాతీయ జండాను ఆవిష్కరించారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కేంద్ర కారాగారం సూపరిడెంటెంట్ ప్రకాష్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాయచోటి పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో మంత్రి నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న అధికారులు



మంత్రి రాంప్రసాద్ రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ, డీఆర్ఓ | అనిల్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి | టి.భరత్‌కుమార్‌రెడ్డి, సమాచార శాఖాధికారి | నాగభూషణం కలెక్టరేట్ ఏఓ | మునిస్వామి, జిల్లా రిజిస్ట్రార్ | పురుషోత్తం, డీపీఆర్ఓ | జయరామయ్య, జిల్లా డ్రగ్ కంట్రోలర్ | కె.విశ్వనాథ్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి | భరత్‌చౌహాన్, జిల్లా రవాణాధికారి | దయాకర్‌రెడ్డి, ఎస్ఈ, పీఆర్ | ప్రసన్నకుమార్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యుఎస్ | శివప్రకాశ్‌రెడ్డి, డీఈఓ | హరిక్రిష్ణ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి



ధనలక్ష్మి, డీపీఓ | సహదేవరెడ్డి, ఎస్ఈ, ఆర్అండ్‌బీ | త్యాగరాజు, ఏడీ, మార్కెటింగ్ | శివకుమార్, సమాచార శాఖ | వెంకటేశ్వరరెడ్డి, పీడీ, ఏపీఎంఐపీ | డేవిడ్ సుకుమార్, | మద్దిలేటి, పీడీ, డ్వామా | రంగస్వామి, ఆర్డీఓ, రాయచోటి | వివేక్, జిల్లా ఫారెస్ట్ అధికారి | వెంకటేశ్వర్లు, ఏడీ, సీపీఓ | పి.నరసింహ, సూపరింటెండెంట్ | శివసాయి గణేశ్, జూనియర్ అసిస్టెంట్ | కలందర్, కలెక్టర్ సీసీ | రాజేంద్రరాజు, కలెక్టర్ సీసీ



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

దొంగ అరెస్టు - బంగారు నగలు స్వాధీనం



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సుధాకర్

కడప క్రైం ఆగస్టు 15: కడప నగరం నెహ్రూనగర్‌లో ఓ ఇంట్లో చోరీ చేసిన దొంగను బైపాస్ రోడ్డులోని చలమారెడ్డి పల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్ తెలిపారు. కడప చిన్నచౌకు పోలీసు స్టేషన్‌లో గురువారం సీఐ తేజమూర్తి, ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డితో కలిసి నిందితుడి వివరాలను వెల్లడించారు. నెహ్రూనగర్ వాసి అబ్బూరి రమణ అలియాస్ అబ్బూరి వెంకటరమణ నాయుడు ప్రస్తుతం మాసాపేటలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల నెహ్రూనగర్‌లోని ఓఇంట్లో తాళాలు పగుల గొట్టి బంగారు నగలు అపహరించినట్లు తెలిపారు. ఎస్పీ హర్ష వర్ధన్ రాజు ఆదేశాల మేరకు చిన్నచౌకు సీఐ, ఎస్ఐ సిబ్బందితో నిఘా ఉంచినట్లు తెలిపారు. గురువారం నిందితుడు చోరీ చేసిన బంగారు నగలతో పారిపోతున్నట్లు సమాచారం రావడంతో నిందితుడిని అరెస్టు చేసి అతడి నుంచి 48.600గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బంగారం విలువ రూ.3.50లక్షలు ఉంటుందన్నారు.

కోదండరాముడి సేవలో మంత్రి నారాయణ సతీమణి



మంత్రి నారాయణ సతీమణి ఇందిరకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 15: ఏకశిలా నగరి కోదండరాముడిని మంత్రి నారాయణ సతీమణి ఇందిర గురువారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్టు సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి రంగ మండపంలో ఆలయ విశిష్టతను, చరిత్రను తెలియజేశారు. పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఇక్కడి శిలాసంపద అద్భుతంగా ఉందని, రామాలయ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ఆమెకు మండల టీడీపీ నేతలు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు శ్రావణ్‌కుమార్, సిబ్బంది వినోద్, ఎంపీటీసీ సుభాన్‌బాషా, బొబ్బిలి రాయుడు, మీనిగా రమణ, మౌలాలి, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



రెడ్డివరప్రసాద్ మృతదేహం

చిన్నమండెం, ఆగస్టు15: రాయచోటి- మదనపల్లె జాతీయ రహదారిపై గురువారం ఉదయం గొర్లముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు రెడ్డివరప్రసాద్ (44) మరణించారు. చిన్నమండెం మండలం చాకిబండ కస్పా వాసి రెడ్డివరప్రసాద్ భార్యభర్తలు ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు. రెడ్డివరప్రసాద్ కదిరివాండ్లపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అయితే జెండా వందనం కోసం బయలుదేరి రాయచోటి నుంచి కదిరివాండ్లపల్లె పాఠశాలకు వెళుతుండగా గొర్లముదివేడు క్రాస్ వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

టిప్పర్ డ్రైవర్...

సికెదిన్నె, ఆగస్టు 15: రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ పెద్దారెడ్డి చంద్రారెడ్డి (57) మృతి చెందినట్లు సికెదిన్నె పోలీసులు తెలిపారు. గురువారం తెల్లవారు జామున వేపమాను సత్రం వద్ద లారీ, టిప్పర్ ఢీకొనడంతో టిప్పర్ డ్రైవర్ మృతిచెందగా లారీ డ్రైవర్ మునియన్ కాళ్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. కోనంపేట నుంచి పల్సర్ లోడుతో వస్తున్న టిప్పర్ వేపమాను సత్రం వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రున్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు. మృతుడు సిద్దవటం మండలం చౌడేశ్వరీపేట వాసి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సికెదిన్నె, ఆగస్టు 15: అనుమానాస్పద స్థితిలో సిద్ధం నరేష్ (43) మృతిచెందాడు. కడప మరియాపురం వాసి నరేష్ అతని మిత్రులు శ్యాం, దినేష్‌తో కలిసి బుగ్గలేటిపల్లె శ్మశానం వద్ద సమాధికి పెయింట్ వేసేందుకు వచ్చి మద్యం తాగిన అనంతరం వారి మధ్య ఏమి జరిగిందో తెలియదు కానీ నరేష్ మృతిచెందాడు. మృతుడి శరీరంపై స్వల్ప గాయాలున్నట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

ఉద్యోగులకు స్థానచలనం కలిగేనా?

● పాతుకుపోయిన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు

పెండ్లిమర్రి, ఆగస్టు 15: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ప్రజలతో సంబంధం ఉండే శాఖలో సాధారణ బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో భాగంగా ఐదేళ్లు ఒకేచోట ఉద్యోగం చేస్తున్న వారిని, మిగిలిన చోట్ల పరిపాలనా పరమైన అవసరాల మేరకు బదిలీ చేసేందుకు వీలుంటుంది. ఈ బదిలీల కోసమే గ్రామ సభలను కూడా ప్రభుత్వం వాయిదా వేసింది. మండలంలో కొన్నేళ్లగా కొందరు అధికారులు ఇక్కడే తిష్ట వేసి ఉన్నారు. పార్టీలు మారిన ఐదేళ్లలో మారిన వీరు మాత్రం ఏదో ఒక మండలస్థాయి నేతను పట్టుకుని ఇక్కడే ఉంటున్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు గ్రామ రెవెన్యూ అధికారులు ఇక్కడే పాతుకుపోయారు. చాలా మంది అధికారులు కడప నగరంలో నివాసం ఉండడంతో పెండ్లిమర్రి మండలం వారికి ప్రయాణానికి అనుకూలంగా ఉండడంతో ఏదో ఒక నిబంధనో మండలంలోని పంచాయతీలు మారుతూ ఇక్కడే తిష్ట వేశారు. కొందరు మండలస్థాయి అధికారులు కూడా ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటున్నారు. చివరికి డిప్యుటేషన్‌పై కూడా కొందరున్నారు. పరిపాలన గాడిలో పడాలంటే ఈబదిలీల్లో ఐదేళ్ల దాటిన అధికారులను మరోచోటికు బదిలీ చేసి కొత్త అధికారులు ఇక్కడకు వస్తే పరిపాలన గాడిన పడుతుందని మండల ప్రజలు కోరుకుంటున్నారు. వైసీపీ పాలనలో ఇక్కడ పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులు ఆ పార్టీకి వన్‌సైడ్ చేశారు. ఇపుడు అధికారం మారింది. యువనేత ఎమ్మెల్యేగా రావడంతో మండల ప్రజలు ఇప్పుడున్న అధికారులను ఇక్కడ నుంచి బదిలీచేసి కొత్తవారిని తెచ్చుకుని ప్రజా పరిపాలన తెస్తాడని ఎమ్మెల్యేపై మండల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన ఉద్యోగులను ఈ బదిలీల్లో వేరే చోటకు పంపాలని కోరుకుంటున్నారు. ఈ అధికారులే ఉంటే మళ్లీ ప్రజల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారవుతుందన్నారు. లీడర్లు కూడా ఆలోచించి సమర్థవంతమైన అధికారులకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు అధికారులను కోరుతున్నారు.

మందుబాబుల హల్‌చల్

ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్న మద్యం బాటిల్లు
పొలాల్లోకి వెళ్లేందుకు భయపడుతున్న రైతులు



మందుబాబులు పగులగొట్టిన మందుబాటిల్లు

పులివెందుల టౌన్, ఆగస్టు 15: మందుబాబులు మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్నారు. పచ్చని పంట పొలాలను అడ్డాగా మార్చుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మద్యం మత్తులో తాగిన మందు సీసాలను పంటపొలాల్లోకి విసురుతున్నారు. దీంతో పొలాల్లోకి వెళ్లాలంటేనే రైతులు, మహిళలు, కూలీలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలో కూడా మందు షాపులు సమీపంలో ఉన్న ప్లాట్లలో, మెయిన్ రోడ్డు వెంబడి ఎక్కడ పడితే అక్కడ మద్య సీసాలు దర్శనమిస్తున్నాయి. స్థానికులు, రైతులు పలుమార్లు సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డుఅదుపులేకుండా పోయింది. పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టానుసారంగా పట్టణంలో ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తూ మద్యం సీసాలను పగులగొట్టి పడేస్తున్నారు. పట్టణంలోని ఎన్జీఓ కాలనీ, చిన్నకొండారెడ్డి కాలనీ, రాజారెడ్డికాలనీ ప్రాంతాల్లో సమీపంలో వైన్‌షాపులు ఉండడంతో ఈ అరాచకాలు ఎక్కువ అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాడబడిన భవనాలు, బావుల వద్ద మందుబాబులు నిత్యం మందుతాగుతూ పగలు రాత్రి తేడా లేకుండా మత్తులో మునిగి తేలుతున్నారు. మద్యం సీసాలను పంటపొలాల్లోకి విసిరి వేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మద్యం మత్తులో దాడులకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం మందుబాబుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటోందని రైతులు చెప్పుకొచ్చారు. బ్యాచ్‌లు బబ్యాచ్‌లుగా మందు తాగుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'మరో పోరాటానికి సిద్ధం కావాలి'

వేంపల్లె, ఆగస్టు 15: ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని రాజ్యసభ మాజీ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వేంపల్లెలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఆకలి చావులు ఉండేవని, విద్య, వైద్య, రవాణా, మౌలిక సదుపాయాలు ఉండేవి కావన్నారు. పారిశ్రామికంగా గుండుసూది కూడా తయారుచేసుకోలేని స్థితిలో ఉండేవారమన్నారు. ప్రస్తుతం బీజేపీ పాలనలో రాజ్యాంగ పునాదులు కదులుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. అందువల్ల మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు సంసిద్ధం కావాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

●మరో ఇద్దరికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 15: నీరుగట్టువారి పల్లె వద్ద అనంతపురం- చెన్నై జాతీయ రహదారిలో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో నరసింహులు (27) మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గెజ్జలకుంట వాసి వెంకటరమణ కుమారుడు నరసింహులు కురబల కోట మండలం సర్కారుతోపు బండపల్లెకు చెందిన దినేష్, తిరుమలప్ప బైక్‌లో వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టడంతో బైక్‌పైన ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే జిల్లా అస్పత్రికి తరలించగా నరసింహులు మృతి చెందగా మిగిలిన ఇద్దరికి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు.

సమరయోధునికి సన్మానం



సమరయోధుడు బాలయల్లారెడ్డిని సన్మానిస్తున్న వంశీక్రిష్ణ

చెన్నూరు, ఆగస్టు 15: దేశం కోసం దేశానికి స్వాతంత్ర్యం రావడం కోసం తన వంతు బాధ్యత పోషించిన 104 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధుడు బాల యల్లారెడ్డిని చెన్నూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వంశీక్రిష్ణ కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వంశీక్రిష్ణ మాట్లాడుతూ ఇలాంటి గొప్పవాడిని సత్కరించుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని, వారి స్ఫూర్తి, వారి సలహాలు, సూచనలు మాలాంటి యువ వైద్యులకు ఎంతో అవసరమని సమరయోధుడు జీవించి ఉన్నంతకాలం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. గొప్పగొప్ప నేతలు, పెద్దలు ఆయనను మరిచినా పీహెచ్‌సీ వైద్యాధికారి సన్మానించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మునిరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

దేశ పురోగతికి పాటుపడదాం

- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో వైవీయూ వీసీ క్రిష్ణారెడ్డి
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


వికాస్ పాఠశాలలో వందన సమర్పణ చేస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి, వికాస్ హరిక్రిష్ణ


సాయిబాబా స్కూల్‌లో జెండా వందనం చేస్తున్న స్కూల్ కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి


ర్యాలీలో పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి


స్వాతంత్య్ర వేడుకల్లో గురుకుల్ విద్యాపీఠ్ పాఠశాల యాజమాన్యం సిబ్బంది

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 15 : దేశ పురోగతికి పాటుపడదాం అని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం వైవీయూలో 78వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతావని సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ పురోగతికి విశ్వవిద్యాలయాల ఆలోచనలు, ఆవిష్కరణలు దోహదమయ్యేలా విద్యార్థులు పరిశోధకుల కృషి జరగాల న్నారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మా, స్పోర్ట్స్ అండ్‌సైన్స్ శాఖ సంచాలకులు డాక్టర్ రామసుబ్బారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి సెల్యూట్ చేశారు.

అంథ విద్యార్థుల అద్భుత ప్రతిభ

కడప నగరం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సమగ్ర శిక్ష శకటం మార్చ్‌ఫాస్ట్ చేస్తూ అంథ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరి డ్రమ్స్‌బీట్ అందరినీ ఆశ్చర్యపరిచింది.

చిత్రలేఖన ప్రదర్శన: కడప బాలోత్సవం నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు వేసిన చిత్రాల్లో ఎంపిక చేసిన చిత్రాల ప్రదర్శనను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరు వైఓ నందన్, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శనరెడ్డి, అధ్యక్షుడు గోపాల్ ప్రారంభించారు.

వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో..

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీలో 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు రాజేష్‌కుమార్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

వైసీపీ కార్యాలయంలో... కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేయరు సురేష్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కార్పొరేషన్ కార్యాలయంలో...

కడప నగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయరు సురేష్‌బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం త్యాగధనులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. కమిషనర్ వైఓ నందన్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో...

కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సలీంబాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు.

వికాస్ హైస్కూలులో... కడప నగరం అక్కాయపల్లె వికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప ఎమ్మెల్యే మాధవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలాగే పాఠశాల కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగఫలితంగా ఏర్పడిన భారతదేశాన్ని నేటి యువత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రిన్సిపాల్ ఫాతిమా, ప్రధానోపాధ్యాయులు హమీద్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్ విద్యాపీఠ్‌లో... కడప నగరం గురుకుల్ విద్యాపీఠ్ పాఠశాలలో స్వాతంత్య్ర దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ వెంకటేశ్వర్లు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్ స్కూలు ఆధ్వర్యంలో... కడప నగరం అక్కాయపల్లె పవన్ కాన్సెప్ట్ స్కూలు ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

రాజ్‌పద్మ ఇన్‌లో... కడప నగరం మున్సిపల్ కార్యాయలం ఎదుట గల రాజ్‌పద్మ ఇంట్లో ప్రభుత్వ పథకాల రాష్ట్ర కన్వీనరు సింగారెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినత్సోవ వేడుకలు జరిపారు. జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేశారు.

ఆఫీసర్స్ క్లబ్‌లో... కడప నగరం ఆఫీసర్స్ క్లబ్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ విశ్రాంత మాజీ జిల్లాఅధ్యక్షులు చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామయ్య ఐటీఐలో... కడప నగరం మరియాపురం రామయ్య ఐటీఐలో స్వాతంత్యదినోత్సవ వేడుకలు జరిపారు. మల్లిఖార్జునరావు జెండా ఆవిష్కరించారు.

జనసేన ఆధ్వర్యంలో... కడప నగరం జనసేన నాయకుడు తుంగా రమణయ్య ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన సైనికుల సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పించారు.

అరుణాచలం హాస్పిటల్‌లో... కడప నగరం అరుణాచలం హాస్పిటల్‌లో స్వాతంత్య్ర దినోత్సవవేడుకల్లో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. హాస్పిటల్ సీఈఓ, జంగాకోటిరెడ్డి, డాక్టర్ రెడ్డప్పగారి నిరంజన్‌రెడ్డి, రెడ్డప్పగారి మమతేశ్వరి, డాక్టర్ సొహైల్ మల్లిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ కార్యాలయంలో... కడప హ్యూమన్‌రైట్స్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. హ్యూమన్‌రైట్స్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సుంకేసుల బాదుల్లా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ప్రభుత్వ వైద్యకళాశాలలో..

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 15 : కడప నగర పరిధిలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యకళాశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మానసిక వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు ఆధ్వర్యంలో జెండా వందనం చేశారు.

సీపీఐ జిల్లా కార్యాలయంలో..

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

జగతి స్కూలులో...

సీకేదిన్నె, ఆగస్టు 15: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జగతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి, కరస్పాండెంట్ నితీష్‌రెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శృతి, శ్రీవాణి, మంజుల, అపర్ణ, జకీరా, సబీహా, నీలోఫర్, అరుణ, ఫరూక్, వైష్ణవి, స్వప్న, మానస, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం వద్ద... కడప (మారుతీనగర్), ఆగస్టు 15: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు కార్యాలయం వద్ద స్వాతంత్య్రం దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించి వారిని ఘనంగా సత్కరించారు.

పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలు

కడప రూరల్, ఆగస్టు 15 : పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలని జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ శారద, వైస్ చైర్మన్ బాలయ్య పేర్కొన్నారు. జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

న్యాయవాదుల సంఘ భవనంలో...

జిల్లా కోర్టు ప్రాంగణంలోని కడప బార్ అసోసియేషన్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి కెనడీ, ఇతర నాయకులు, జడ్జిలు, న్యాయవాదులు సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ లీగల్‌సెల్ కార్యాలయంలో లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి నివాళులర్పించారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి శ్రమించాలి

పాడిపరిశ్రమ అభివృద్ధికి శ్రమించాలని పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మాధవరెడ్డి పేర్కొన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే జిల్లా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, వ్యవసాయ, మత్స్య శాఖ, డీసీసీబీ, డీసీఎంఎస్, పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయాలలో జెండాను ఎగురవేశారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో....

కడప (కలెక్టరేట్), ఆగస్టు 15: కడప జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో ఆ సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు చెంచి రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

కడప (మారుతీనగర్), ఆగస్టు 15: మహిళా సాధికారతే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్ పేర్కొన్నారు. మరియాపురం ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో జెండా ఎగురవేశారు. బ్యాంకు జనరల్ మేనేజరు గిరి పాల్గొన్నారు.అలాగే సైనిక సంక్షేమం భవన్‌లో జెండా రెపరెపలు జిల్లా సైనిక సంక్షేమ అధికారి జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు.

కాంగ్రెస్ కార్యాలయంలో....

కడప(కలెక్టరేట్), ఆగస్టు 15: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నగర మాజీ అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి జాతీయ జండాను ఎగుర వేశారు.

చెన్నూరులో... చెన్నూరు పోలీసు, తహసీల్దారు, ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండా ఎగురవేశారు. సీఐ పురుషోత్తంరాజు, తహసీల్దారు జీవన్ చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, వైసీపీ కన్వీనరు జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

వల్లూరులో... తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో కార్యాలయంలో, అలాగే విద్య, వైద్య, ఉపాధి, పోలీసుస్టేషన్ తదితర కార్యాలయాల్లో ఆయా అధికారులు జెండాను ఎగురవేశారు. జిల్లా పరిషత్ గంగాయపల్లె పాఠశాలలో 2024 పదోతరగతి 555 మార్కులు సాధించిన దివాకర్, హేమలతకు ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి రూ.10వేలు అందించారు.

పులివెందులలో...


జెండా వందనం చేస్తున్న జనసేన నేత తుంగా రమణయ్య

పులివెందులలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నజీర్ అహ్మద్ జండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్, పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వరప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

చక్రాయపేటలో... అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. నాగులగుట్టపల్లె గ్రంథాలయంలో జాతీయ జండాను బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కె.రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

వేంపల్లె, ఆగస్టు 15: మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో ఈ వేడుకలు పండుగలా జరుపుకున్నారు. చైతన్య హైస్కూల్లో కరస్పాండంఎట్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జండాను ఎంపీడీఓ దివిజ ఆవిష్కరించారు. ఉషాకిరణ్ హైస్కూల్లో కరస్పాండెంట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జండాను ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు.నారాయణ హైస్కూల్లో కరస్పాండెంట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి జాతీయ జండాను ఆవిష్కరించారు. స్వామి వివేకానంద హైస్కూల్లో కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు.

పెండ్లిమర్రిలో...అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనురాధ సిబ్బందితో కలిసి మువ్వన్నెల జండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

వీఎన్‌పల్లెలో... అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలలో జాతీయ జెండాను ఆయా శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

లింగాలలో... అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద మువ్వన్నెల జండా రెపరెపలాడింది. గౌరవ వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.

వేములలో.. మండల వ్యాప్తంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద ఆయా ప్రధానోపాధ్యాయులు, అధికారుల జాతీయ జెండాను ఎగురవేశారు.

సింహాద్రిపురంలో...

మండల పరిధిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులు పతాకావిష్కరణ కావించి స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.


అరుణాచలం హాస్పిటల్‌లో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే, హాస్పిటల్ యాజమాన్యం


సీకేదిన్నె మండలం జగతి ఇంటర్నేషనల్ స్కూలులో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు


వేంపల్లె చైతన్య హైస్కూల్లో జెండా వందనం చేస్తున్న ఎంపీడీఓ, కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి


ఉషాకిరణ్ హైస్కూల్లో విద్యార్థుల స్వాతంత్య్ర దినోత్సవ ప్రదర్శనలు


నాగార్జున ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో జెండా వందనం చేస్తున్న కరస్పాండెంట్ తులశమ్మ


నారాయణ హైస్కూల్లో జెండాను ఎగురవేస్తున్న తులసిరెడ్డి, కరస్పాండెంట్ నారాయణరెడ్డి


రామయ్య ఐటీఐలో జెండాను ఆవిష్కరిస్తున్న మల్లిఖార్జునరావు


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి


టీడీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న బీటెక్ రవి

విద్యాసాగర్ హాస్పిటల్‌లో 'ఫ్రీడమ్ ఫ్రమ్ పెయిన్ డిపెండెన్స్ టు ఇండిపెండెన్స్'


మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 15 : కడపలో విద్యాసాగర్ హాస్పిటల్‌లో జెండా ఎగరవేసిన అనంతరం విద్యాసాగర్ ఆర్థరైటిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఫ్రీడమ్ ఫ్రమ్ పెయిన్ - డిపెండెన్స్ టు ఇండిపెండెన్స్' అనే కార్యక్రమాన్ని కీలే కదలికకు కీలకం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది వరకు తీవ్రమైన మోకాలు, అరురుగుదల, నొప్పితో బాధపడుతూ దైనందిన కార్యక్రమాలు చేసుకోవడానికి కూడా వాకర్, కర్రవంటి వాటి పై ఆధారపడుతూ ఉన్న వారు మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స తరువాత నొప్పి నుంచి విముక్తి పొందుతున్నారన్నారు. మోకీలు మార్పిడి ఆపరేషన్ తరువాత మునుపటి జీవితాన్ని తిరిగి పొంది, సాధారణ మోకాలు అనే భావనతో తమ వృత్తులను సాఫీగా చేసుకుంటున్న వారు తమ సంతోషాన్ని పంచుకున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కీలు మార్పిడి శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ సి.విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ కీలు మార్పిడి అనంతరం తీసుకోవాలసిన జాగ్రత్తలు వివరించారు. షుగరు వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీలక్ష్మి, ప్రముఖ యోగా నిపుణుడు డాక్టర్ రంగనాథరెడ్డి, విద్యాసాగర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు

వల్లూరు, ఆగస్టు 15 : సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి కడప టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డిని కలిసి అభినందించారు. ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీకి నిధులు కేటాయించి పూర్వవైభవం వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం ఆయన ఎమ్మెల్యేను సన్మానించారు.

విజయదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి నారాయణ సతీమణి


అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఇందిర

కడప (కల్చరల్), ఆగస్టు 15 : విజయదుర్గాదేవి అమ్మవారిని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ సతీమణి ఇందిర గురువారం దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కోరుకున్న మొక్కు తీరడంతో తిరిగి అమ్మవారిని దర్శించుకున్నానన్నారు. అమ్మవారు మహిమ గల దేవత అని కొనియాడారు. కాగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఆమెకు ఆలయ నిర్వాహ కులు దుర్గాప్రసాద్ దంపతులు స్వాగతం పలికి అమ్మవారికి పట్టువస్త్రాలను అందించారు.


మంత్రి ఫరూక్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజా, టైపిస్ట్, మైనార్టీ డిపార్ట్‌మెంట్


ప్రశంసాపత్రం అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ కృష్ణమోహన్‌రావు

ఘనంగా పాకా సురేశ్ జన్మదిన వేడుకలు

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 15 : కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో 47వ డివిజను కార్పొరేటరు పాకా సురేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా సమక్షంలో భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పుట్టిన రోజులు నిండు నూరేళ్లూ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటరు పాకాసురేశ్


ప్రొద్దుటూరు: జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


చెన్నంపల్లెలో జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ


బద్వేలు: జెండా ఆవిష్కరించిన సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ


ఎర్రగుంట్ల: జాతీయపతాకాన్ని అవిష్కరిస్తున్న ఛైర్మన్, అధికారులు


మైదుకూరు: జెండావందనం చేస్తున్న పుట్టా సుధాకరయాదవ్

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

ప్రొద్దుటూరు , ఆగస్టు 15 : నాటి వీరుల త్యాగఫలం నేటి స్వాతంత్రం అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర వీరుల త్యాగాలకు స్మరించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చుల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఆసుపత్రిలో సూపరిండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు, మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి త్రివర్ణ పతాకం ఎగురవేశారు. కమిషనర్ రఘునాథరెడ్డి, వైస్ ఛైర్మన్ బంగారు రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వండాడి గంగయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. డీటీలు సాయినాథరెడ్డి సుదర్శన్ అజయ్‌బాబు, ఆర్ఐ నాగ మోహన్‌రెడ్డి సాయిప్రసాద్ వీఆర్వోలు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ జాతీయజెండాను ఆవిష్కరించారు. టీడీపీ కార్యాలయం, ఉర్దూ స్కూల్, వనిపెంట గురుకుల పాఠశాల తదితర ప్రాంతాల్లో వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాసరిబాబు, ఏపీ రవీంద్ర, పాలమాబు, కొండపల్లి ఉమాకాంత్, మేకల బాబు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు : మున్సిపల్ కార్యాలయం, నాగభూషణం కళాశాలల వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సుధ జాతీయ జెండాను ఆవిష్కరించారు.జడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, విద్యాకమిటీ ఛైర్మన్ ఈ.రాజేశ్వరితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చంద్రమౌళి, ఎస్ఆర్ఎన్‌బీ డిగ్రీ కళాశాలలో యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఉదయ భాస్కర్‌రాజు, , అర్బన్ పోలీసుస్టేషన్‌లో సీఐ రాజ గోపాల్ యాదవ్, ఆర్టీవో కార్యాలయం ఎదుట ఆర్టీవో, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే, డాక్టర్ రాం.ప్రసాద్, ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎక్సైజ్ సీఐ ,ఆర్టీసీ డిపో వద్ద డిఎం శ్రీనివాసులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సబ్ రిజిస్ట్రార్ , తెలుగుగంగ కార్యాలయం వద్ద ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఫాతిమా మసీదు ఆవరణలో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ హాస్టళ్లలో వార్డన్లు మధుసూధన్‌రెడ్డి, ప్రసాద్, చంద్రబోసు, హరిక్రిష్ణ, విజయమ్మ , లక్ష్మీదేవి జెండా ఎగురవేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకట సుబ్బారెడ్డి జెండా ఎగురవేశారు. మున్సిపల్ కమిషనర్ మోతినేని కృష్ణ, మున్సిపల్ ఛైర్మన్ రాజ గోపాల్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ గోపాలస్వామి, సాయిక్రిష్ణ, అధికారులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముద్దనూరు: ఎమ్మార్వో కార్యాలయం వద్ద తహసీల్దారు రామకుమారి, పోలీస్ స్టేషన్ వద్ద సీఐ దస్తగిరి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో చంద్రమౌళి, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో వెంకటకృష్ణారెడ్డి పలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల వద్ద అధికారులు జాతీయ జెండా ఎగురవేశారు.

మైలవరం: మండలంలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద తహసీల్దారు లక్ష్మినారాయణ, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో శంషాద్‌బేగం, మైలవరం పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ రెడ్డి సురేష్ పతాకం ఎగురవేశారు.

అట్లూరు: తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రవిశంకర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుజాతమ్మ, అట్లూరు కేజీబీవీ స్కూలులో ప్రత్యేక అధికారి ఫణిశ్రీ, ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ కొత్తపు రమాదేవి, అట్లూరు పోలీసుస్టేషన్‌లో పోలీసుసిబ్బంది, కొండూరు సచివాలయంలో టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుధారాణి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి జెండా ఎగుర వేశారు.

కలసపాడు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పీజే ప్రేమ కవిత ఆధ్వర్యంలో వేడుకలు ర్వహించారు. పాఠశాల కమిటి ఛైర్మన్ రహ్మతుల్లా, సీనియర్ ఉపాధ్యాయుడు సి.నాగేశ్వర్ రావు, సర్పంచ్ శివలీల, న్యూయార్క్ కార్నల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. గత సంవత్సరం పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు పాఠశాల స్థల దాత పులి ఈశ్వరమ్మ, పాఠశాల ఉపాధ్యాయినులు పి.కవిత, సలోమి, సత్యవతి, అంజని, పుష్పలత, రాజమ్మ, రబ్బాని, మహబూబ్‌చాంద్‌లు రూ.40 వేల విలువైన ప్రోత్సాహక బహుమతులు అందించారు.

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పంచాయతీ కార్యాలయ ఆవరణలో, జిల్లా పరిషత్ హైస్కూలులో సర్పంచ్ యనమల సుధాకర్ జాతీయ జెండా ఎగరవేశారు ఉప సర్పంచ్ రాళ్లపల్లి రవికుమార్, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌ఛైర్మన్ ఎస్‌ఎంబాషా, తిరుమలశెట్టి సుబ్బారావు, సుబ్బాచారి, షరీఫ్, రామసుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసాదరావు, ఎస్ఐ కొండారెడ్డి, సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి వారివారి కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.

బ్రహ్మంగారిమఠం : ఎస్ఐ చంద్రశేఖర్, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, వెలుగు ఏపీయం జి.ప్రకాశరావు, ఏవో ప్రవీణకుమార్, సొసైటీసీఈవో రామిరెడ్డి, మల్లేపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి తమతమ కార్యాలయాల ఆవరణల్లో జెండా ఎగురవేశారుమండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, చిలమల నారాయణ, ముద్దుకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: ఎంపీడీవో నాగప్రసాద్ , తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి , సీఐ మహమ్మద్‌రఫీ, ఎఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ, ఏఐటీయూసీ, కార్యదర్శులు మనోహర్‌బాబు, వెంకటరమణ తమతమ కార్యాలయాల్లో జెండా ఎగురవేశారు.

ఎర్రగుంట్ల: నగర పంచాయతీ ఛైర్మన్ ఎం.హర్షవర్ధన్ రెడ్డి, కమిషనర్ రామకృష్ణయ్య, తహసీల్దార్ శోభన్ బాబు, సీఐ నరేష్‌బాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ త్రివిక్రమం రెడ్డి వారివారి కార్యాలయాల్లో జెండా ఎగురవేశారు. మానవత జిల్లా నేత కల్లూరు గంగాధర్‌రెడ్డి రూ.40వేలు బహుమతులను సీఐ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.

చాపాడు: అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండా ఎగురవేశారు. తహసీల్దారు యామిని, ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు, ఏపీఎం రమణ, ఏపీవో జగదీష్, హెడ్మాస్టర్లు మహమ్మద్‌గౌస్, నరసింహశాస్త్రి, కరస్పాండెంట్లు వేణుగోపాల్, నాగేశ్వరరెడ్డి తదితరులు జెండా వందనం చేశారు.

ఖాజీపేట: తహసీల్దారు సరస్వతి, ఏఎస్ఐ నాగరాజు, ఎంపీపీ సిద్దిక్, ఎంఈవో స్వర్ణలత, కస్తూరిబాగాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ భార్గవి, సర్పంచ్ రాణెమ్మ, ఏవో నాగార్జున వారివారి కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు దేశభక్తుల వేషధారణలో మువ్వెన్నెల జెండా చేతపట్టిన చిన్నారులు డప్పులు వాయిస్తూ బస్టాండు కూడలిలోకి చేరుకుని గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఖాజీపేట మండవల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ, పొట్టిశ్రీరాముల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి మిఠాయిలు పంపిణీ చేశారు.

బి.కోడూరు : తహసీల్దారు ఆలీఖాన్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎస్ఐ రాజు, అన్ని పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటి ఛైర్మన్లు జెండాను ఆవిష్కరించారు.

గోపవరం: గోపవరం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఉదయభారతి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ ధనలక్ష్మి జెండాను ఆవిష్కరించారు. ఈవోపీఆర్‌డి హసీనా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణంలో వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, మండల పరిధిలోని పలు సచివాలయ ప్రాంగణాల్లో జెండాలు ఎగురవేశారు.

బద్వేలు రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పెన్షనర్స్ సంఘ కార్యాలయంలో ఆ సంఘ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, రత్నం ఇంగ్లీషు మీడియం స్కూలులో మున్సిపల్ కమిష నర్ ఎం.కృష్ణ జెండాను ఆవిష్కరించారు. పెన్షనర్స్ సంఘ కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, గంగన్న, పుల్లయ్య, రత్నం స్కూలు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్: ప్రొద్దుటూరు డివిజన్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహాలకు నివాళులు అర్పించారు.ం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సైనిక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు బాలవీరారెడ్డి, కోశాధికారి సాంబశివారెడ్డి, యల్లయ్య, దస్తగిరి, సుబ్బారెడ్డి, మోహన్, మాజీ సైనికులు పాల్గొన్నారు. కొత్తి హైస్కూలులో 1993-94 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సుంకర వేణుగోపాల్, హైదర్, షేక్షావలి, ఓబులేసు, బాలయ్య, షఫి, బాబు తదితరులు పాల్గొన్నారు. మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టీస్ కార్యాలయంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం జాతీయ పతాకం ఆవిష్కరించారు. జాకీర్ ఉమ్రి, హుస్సేన్‌బాష, మహమ్మద్‌రఫి, నజీర్ అహ్మద్, షఫి పాల్గొన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు జాతీయ గీతాల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి ఉషారాణి, మణిశయన, అనూరాధ, సరస్వతి, సునంద, హారిక, తదితరులు పాల్గొన్నారు. ప్రెస్ క్లబ్‌లో మాజీ సైనికులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం: క్విట్ కార్పొరేట్ నినాదంతో ప్రజా పోరాటాలు నిర్మిద్దామని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు అన్నారు. గురువారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరణ అనంతరం మాట్లాడారు. ఈ వేగుకల్లో సీపీఐ నాయకులు మచ్చ శ్రీను, బాషా, దస్తగిరి, కొత్తి సురేష్‌కుమార్, జహీర్, పీటర్, టోనీ, తానిఫ్, మనోష్ పాల్గొన్నారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ భక్తవత్సలం, గవర్నమెంట్ హాస్పిటల్‌లో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనంద్‌బాబు జెండా ఎగురవేశారు.

ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తాం : ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్ ఆగస్టు 15 : తెలుగుగంగా ఎస్ఆర్ 2 నుంచి ప్రతి ఎకరాకు నీరందిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మండలంలోని లెక్కలవారిపల్లె సమీపంలోని ఎస్ఆర్2 నుంచి గురువారం నీటిని విడుదల చేశారు ఈ సందర్భంగా రైతులతో ఫొటో దిగారు. అనంతరం పుట్టా మాట్లాడు తూ నీటి విడుదలతో వనిపెంట, మిట్టమానుపల్లె, మాచుగారి పల్లె, గంగాయలపల్లె తదితర గ్రామాల్లోని సుమారు పది వేల ఎకరాల భూములకు నీరందుతుం దన్నా రు. తిప్పిరెడ్డి పల్లె, ముద్దిరెడ్డిపల్లె చెరువులకు 2014-19 తెలుగుదేశం ప్రభుత్వం లో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరందించేందుకు ప్రతిపాదనలు రెడీ చేయగా, గత ప్రభుత్వం నిర్లక్షంతో పనులు మొదలు పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అయితే మరో రెండు నెలల్లో టెండర్లు పిలి చేలా ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో మాట్లాడుతున్నామని కేవలం ఒకటిన్నర సంవత్స రంలో పనులు పూర్తి చేసి, నీరందిస్తామని తెలిపారు. లెక్కలవారిపల్లె నుంచి మైదుకూరుకు వస్తున్న దారిలో పంట చేలో ఉన్న కూలీలను పుట్టా ఆప్యాయంగా పలకరించారు.

వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరిబాబు, భీమయ్య, కటారి వీరన్న, కొండపల్లి ఉమాకాంత్, మేకల బాబు, చెర్లోపల్లి రమణ, కాలువ గురప్ప. కాలువ శెట్టి, ఏకేఆర్.ఇస్మాయిల్, జైభరత్‌రెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్2 వద్ద రైతులతో పుట్టా సుధాకర్ యాదవ్

సమాజ హితం కోసమే పెద్దల పోరాటం

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 15: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, యోగి వేమారెడ్డి నీతి, నిజాయితీ, నిబద్ధత, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచారని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, యోగివేమారెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. ముద్దనూరు రోడ్డులోని ట్యాంకు వీధి నుంచి రెడ్డి కులస్థులు, రెడ్డి సంఘం నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తొలుగ పాత బస్టాండు సమీపంలో యోగివేమారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజు విగ్రహాల ఆవిష్కరణ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. యోగివేమారెడ్డి పద్య రూపంలో సమాజం కోసం ఎన్నో సూచనలు ఇచ్చారన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మునిసుబ్బారెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎం.చంద్ర, జి.ప్రతాప్‌రెడ్డి, మోరగుడి జయుడు, తదితరులు పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

102 ఏళ్ల వృద్ధురాలితో జెండా ఆవిష్కరణ


జాతీయ జెండా ఎగురవేస్తున్న వృద్ధురాలు

జమ్మలమడుగు, ఆగస్టు 15: మండలంలోని ఎస్.ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన 102 ఏళ్ల వయసున్న మాయలూరు నరసమ్మ అనే వృద్ధురాలితో పాఠశాల సిబ్బంది, గ్రామ నాయకుడు ఎస్.ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి జెండా ఆవిష్కరింపజేశారు. ముందుగా పాఠశాల ఆవరణలో నరసమ్మ, గ్రామ పెద్దలు కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. స్వాతంత్ర్యం దినోత్సవం రోజు జెండా ఆవిష్కరణ చేయడం తనకు గర్వకారణంగా ఉందని వృద్ధ మహిళ తెలిపినది. ఒకవైపు సంతోషం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో వృద్ధ మహిళ కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొరాయించిన జాతీయ జెండా

జమ్మలమడుగు, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జెండా ఆవిష్కరించేందుకు కట్టిన తాడు లాగగా అది మొరాయించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు జెండాను దించి కట్టి మళ్లీ ఎమ్మెల్యేతో ఆవిష్కరించపజేశారు. ప్రభుత్వ ఆస్పత్రి, మున్సిపల్, ఆర్డీవో, తహసీల్దారు, డీఎస్పీ, అర్బన్, రూరల్ పోలీసు స్టేషన్, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గీతాంజలి హైస్కూలు, తదితర పాఠశాలల ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

ఉత్తమ విద్యార్థికి నగదు బహుమతి

పోరుమామిళ్ల, ఆగస్టు 15 :2023-24 పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర చిన వెంకటాపురం పోరుమామిళ్ల జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి భరత్‌కు ఎస్టీయు రాష్ట్ర కళావేదిక కోకన్వీనరు ఎం.రామక్రిష్ణరెడ్డి రూ.5,116లు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తము ప్రతిబ కనబరిచే విద్యార్థులకు రూ.10,116లు అందిస్తామన్నారు. ఎంఈవో బాలఅంకిరెడ్డి, చెన్నరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

ఉత్తమ లైన్‌మన్‌గా రమేశ్

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 15 : బ్రహ్మంగారిమఠంలో విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రమేశ్‌కు ఆ శాఖ తరపున ఉత్తమ లైన్‌మెన్‌గా అవార్డునందుకున్నారు.

65 మంది రక్తదానం

కొండాపురం, ఆగస్టు 15 పంద్రాగస్టును పురస్కరించుకొని ఆర్మీ మాజీ ఉద్యోగి పీర్ల హాజీవలి ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక మసీదు సమీపంలో రెడ్‌క్రాస్ సొసైటీ(అనంతపురం) వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది.. ఈ రక్తదాన శిబిరం 65 మంది రక్తదానం చేసినట్లు హాజివలి తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

వృద్ధాశ్రమంలో మొక్కలు నాటిన మెగా అభిమానులు

ప్రొద్దుటూరు , ఆగస్టు 15 : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మెగా ఫ్యాన్స్ అసోసియేన్ నేతలు అమ్మనాన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అక్కిదాసరి రామారావు, షరీఫ్, చంద్రదర్, బాబురావు, మధు, చెన్నారవి, పల్లా రఘు, రాజు ,చిన్న, రాములు పాల్గొన్నారు,

అనాథ శరణాలయానికి సీఐ విరాళం

ప్రొద్దుటూరు, ఆగస్టు 15 : పట్టణంలోని విద్యార్థి అనాథ శరణాలయానికి త్రీటౌన్‌సీఐ వెంకటరమణ రూ.20 వేలు విరాళం అందజేశారు. గురువారం ఆయన శరణాలయాన్ని కుటుంబ సమేతంగా సందర్శించారు. విద్యార్థులకు అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మనుషులు ఎవరూ అనాథలు కారన్నారు. కుటుంబంలో ప్రేమానురాగాలు కోల్పోయినప్పుడు అందరం అనాథలమేనన్నారు. కార్యక్రమంలో సీఐ భార్య రేణుకాదేవి, కుమారుడు కార్తికేయన్ శరణాలయం నిర్వాహకులు విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు ప్రారంభం

బద్వేలు రూరల్, ఆగస్టు 15 : స్థానిక బిజివేముల వీరారెడ్డి విద్యాసంస్థల మైదానంలో గురువారం నియోజకవర్గస్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలను బి.కోడూరు మండల విద్యాశాకాధికారి మూరతోటి సునీల్ ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలను బీవీఆర్ విద్యాసంస్థల సెక్రటరీ రితీష్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఉపా ధ్యాయ జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఉపాధ్యాయు లకు ఉల్లాసాన్ని కలిగించేందుకే క్రీడా పోటీలు ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాకాధికారులు చెన్నయ్య, రఘురాములు, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున, ప్రభాకర్, సుబ్బారావు, రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

గాయపడిన హోంగార్డుకు ఆర్థికసాయం

ఖాజీపేట, ఆగస్టు 15: విధి నిర్వహణలో బైక్‌పై వెళుతూ కిందపడడంతో హోంగార్డు ప్రసాద్ కాలు విరిగింది. దీంతో ఆయన స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ మద్దిలేటి, హెడ్‌కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి హోంగార్డు భార్యకు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసాద్ త్వరగా కోలుకోవాలన్నారు.

15 మద్యం సీసాల స్వాధీనం

రాజుపాళెం, ఆగస్టు 15 : మండల పరిధిలోని అర్కుట వేముల గ్రామం వద్ద గురువారం సాయంత్రం 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోతవ సందర్భంగా మందు దుకాణాలు మూత పడడంతో మద్యంఅమ్ముతున్నట్లు తెలిపారు. ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గోమాతకు అంత్యక్రియలు

కొండాపురం, ఆగస్టు 15 మండలంలోని చౌటిపల్లెలో గోమాతకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక కాశినాయన ఆశ్రమానికి చెందిన ఈ ఆవును భక్తులు 20 ఏళ్లుగా పోషిస్తున్నారు. బుధవారం రాత్రి ఈ ఆవు మృతిచెందడంతో కాశినాయన ఆలయం వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం


పారిశుధ్య కార్మికులకు సన్మానం చేసిన సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 15 : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాల యంలో గురువారం సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి జెండా ఎగురవేశారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి నరసింహులు ఎంపీటీసీ సభ్యులు వార్డు మెంబరు పాల్గొన్నారు. కామనూరు పీహెచ్‌సీలో వైద్య అధికారి హనీఫ్‌బాబా జెండా ఆవిష్కరించారు. సూపర్‌వైజర్ బిఏ వర ప్రసాద్ నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు

అశ్లీల వెబ్‌సైట్లను నిషేధించాలి

● గళమెత్తిన మహిళా ప్రజా సంఘాలు

ప్రొద్దుటూరు , ఆగస్టు 15 : దేశ వ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు, హత్యలకు కారణమవుతున్న అశ్లీల వెబ్‌సైట్స్‌ను యూట్యూబ్‌లోని అశ్లీల కథనాలను బ్యాన్ చేయాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ డిమాండ్ చేశారు. గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ పుటపర్తి సర్కిల్లో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో బాలికపై అత్యాచారం, హత్యకు అశ్లీల వెబ్‌సైట్లే దురంతానికి కారణమని నేర విచారణలో వెల్లడైందన్నారు. కలకత్తా మెడికల్‌కాలేజీలో జూనియర్ డాక్టర్ గ్యాంగ్‌రేప్ దేశాన్ని మళ్ళీ కలవరపెట్టిందన్నారు. విరసం రాష్ట్ర మాజీ కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ .రెజ్లర్లమీద లైంగిక వేధింపులు జరిగాయని ఉద్యమిస్తే ఈ దేశ ప్రధాని హోం మంత్రి నిందితులను వెనకేసుకొచ్చా న్నారు. మణిపూర్‌లో కూడా మహిళలే బాధితులన్నారు. జమాతే ఇస్లాం అధ్యక్షురాలు రెహనా మాట్లాడుతూ ఈ దేశంలో మహిళలకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదన్నారు. విద్యార్థి శక్తి కన్వీనర్ వడ్ల హరిత మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల ఆరోపణలున్నా ప్రభుత్వం కొనసాగించ డం సిగ్గుచేటన్నారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా సురేష్ మాట్లాడుతూ అత్యాచారాలకు కారణాలను ప్రభుత్వం గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జింకా సుబ్రమణ్యం , దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, ప్రగతిశీల కార్మిక సంఘం కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మిదేవి, ఎన్జీవో ఛైర్‌పర్సన్ జయమ్మ, మాల మహా నాడు రాష్ట్ర అధ్యక్షుడు మురళీప్రసాద్, చైతన్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చిన్నా, జమాతే ఇస్లాం సలీం , నాస్తిక సమాజం కన్వీనర్ జయచంద్ర, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ మహమూద్ టీడీపీ యూత్‌కన్వీనర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తి సర్కిల్లో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

విజయ కంటి వైద్యశాల ప్రారంభం


కంటి వైద్యశాలను ప్రారంభిస్తున్న డాక్టర్ విజయ, డాక్టర్ నాగేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 15 : పట్టణంలో గురువారం డాక్టర్లు ఎన్.విజయ, డాక్టర్ ఎస్.నాగేశ్వరరెడ్డి విజయ కంటి వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్ ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, ఆరోగ్య భద్రత, ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ అన్ని రకముల హెల్త్ ఇన్సూరెన్స్ కలిగిన వారికి ఆపరేషన్లు చేస్తామన్నారు. డాక్టర్ భరత్‌రెడ్డి, డాక్టర్ కవితలు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వైద్యులు, వ్యాపారులు, పురప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఇతర వివరాలు 08564 244330లో తెలుసుకోవచ్చునని వివరించారు.